క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మచిలీపట్నంకు తరలింపు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను సోమవారం పెనమలూరు నుంచి మచిలీపట్నంకు తరలించారు. నియోజకవర్గానికి చెందిన 3,587 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మంగళవారం మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ప్రత్యేక వాహనంలో బందోబస్తుతో మచిలీపట్నంకు తరలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి లెక్కించనున్నారు.

నున్నలో చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని తాగునీటి చెరువు కట్టలు చెరువులకు రక్షణగా ఉండటమే కాకుండా గ్రామస్తులకు వాకింగ్ ట్రాక్‌గా ఉపయోగపడుతున్నాయి. ఒక ప్రభుత్వ అధికారి ఆలోచన వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి దోహదం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ సంవత్సరం క్రితం నున్న గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారిని సన్మానించే కార్యక్రమానికి విచ్చేశారు. ఆ సందర్భంగా నున్న గ్రామంలో తాగునీటి చెరువులను స్పెషల్ చీఫ్ సెక్రటరీ పరిశీలించారు. చెరువుకట్టలపై ప్రజలు ఉదయం, సాయంత్రం నడిచేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ నిర్మించాలని అధికారులకు ఆయన సూచించారు. దీంతో గ్రామ పంచాయతీ రూ. 5లక్షలతో రెండు తాగునీటి చెరువులకు అనుసంధానంగా ఉన్న చెరువుకట్టలను వాకింగ్ ట్రాక్‌గా నిర్మించడం జరిగింది. అప్పటి నుంచి గ్రామస్తులు చిన్నా, పెద్ద తేడా లేకుండా వాకింగ్ ట్రాక్‌పై ఉదయం, సాయంత్రం ఆరోగ్యం కాపాడుకునేందుకు వాకింగ్ చేస్తున్నారు. గ్రామంలో మొట్టమొదటి వాకింగ్ ట్రాక్‌గా దీన్ని స్థానికులు చెబుతున్నారు.

కావ్యశ్రీ కేసులో నిజాలు నిగ్గు తేల్చాల్సిన పోలీసులు

పెనమలూరు: యనమలకుదురులో వారసుడి కోసం వేధింపులకు గురై బలవన్మరణానికి గురైన కావ్యశ్రీ కేసులో పోలీసులు చాలా విషయాలు విచారణలో నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉంది. యనమలకుదురుకు చెందిన కావ్యశ్రీ(19) కంద్రికకు చెందిన సందు శ్రీకాంత్‌ను గత రెండేళ్ల క్రితం వివాహం చేసుకుంది. మొదటి కాన్పులో కుమార్తెకు జన్మ నిచ్చింది. మరల ఇప్పుడు ఆమెకు 5 నెలల గర్భిణీ. కాగా కావ్యశ్రీకి భర్త శ్రీకాంత్ విజయవాడలో లింగ నిర్ధారణకు స్కానింగ్ చేయించగా ఆమె కడుపులో ఆడ బిడ్డ ఉందని తేలిందని, కేవలం వారసుడు మాత్రమే కావాలని భర్తతో పాటు అత్తింటివారి వేధించారని కావ్యశ్రీ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబార్షన్‌కు కావ్యశ్రీ నిరాకరించడం, వైద్యులు కూడా అబార్షన్‌కు అంగీకరించకపోవటంతో శ్రీకాంత్ మిత్రుడు కానిస్టేబుల్ శ్యామ్ అబార్షన్ చేయిస్తానని చెప్పడం వల్లనే కావ్యశ్రీ మరణించిందని తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే ఈ కేసులో లింగనిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్ ఏది..? అలాగే కానిస్టేబుల్ శ్యామ్‌పై చర్యలు ఏమిటనేది పోలీసుల విచారణలో తేల్చాల్సి ఉంది. అయితే పోలీసులు ఇప్పటివరకు అత్తింటివారిని అరెస్టు చేయలేదు. కాగా పోలీసులు కేసు విచారణలో ఉందని మాత్రం చెబుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కె.చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అకట్టుకుంది. సోమవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలకు కళాబృందంలోని సభ్యులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళా బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

కంద్రిక యూపీహెచ్‌సీ పరిధిలో సర్వే

పాయకాపురం(విజయవాడరూరల్): కంద్రికలోని ప్రభుత్వ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం డాక్టర్ కె.రాజా ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులకు సంబంధించి సర్వే నిర్వహించారు. గత వారం రోజులుగా తాగునీరు కలుషితమై స్థానికులు డయేరియాతో విరేచనాలు, వాంతులతో బాధపడుతున్నారని జరుగుతున్న ప్రచారానికి వైద్య సేవలను విస్తృతం చేశారు. అందులో భాగంగా 64వ డివిజన్లో 281, 282, 284, 285 సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది 5 బృందాలుగా ఇంటింటా సర్వే చేశారు. మలేరియా, డెంగీ, విరేచనాలు, వాంతులతో బాధపడుతున్నవారు లేరని డాక్టర్ కె.రాజా తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాగునీటిని కాచి చల్లార్చుకొని తాగాలని డాక్టర్ రాజా సూచించారు.

ఉత్కంఠకు నేడు తెర

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- పెనమలూరు బరిలో 11 మంది అభ్యర్థులు
- నేడు ఎన్నికల ఫలితాలు



కృష్ణా యూనివర్సిటీలో పెనమలూరు ఓట్ల లెక్కింపు కేంద్రం


కంకిపాడు/పెనమలూరు: నరాలు తెగే ఉత్కంఠకు నేడు తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో తుది అంకమైన ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. ఫలితాలతో రాజకీయ ప్రత్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లాలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న పెనమలూరు నియోజకవర్గంపైనే అందరి దృష్టి ఉంది. ఈ నియోజకవర్గంపై భారీ స్థాయిలో పందేలు జరిగాయి.

గెలుపును నిర్దేశించనున్న ఓటరు..

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మే 13న జరిగిన ఎన్నికల్లో పెనమలూరు నియోజకవర్గంలో 2,94,928 మంది ఓటర్లకుగానూ 2,33,414 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 79.14 శాతం పోలింగ్ నమోదైంది. వీటితో పాటుగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ కూడా కీలకంగా మారింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3,220, హోం ఓట్లు 367 కలిపి మొత్తం 3,587 ఉన్నాయి. అలాగే 31 సర్వీసు ఓట్లు అధికారులకు చేరాయి. ఈ ఓట్లతో కలిపి మొత్తం 2,37,032 ఓట్లను అధికారులు లెక్కించాల్సి ఉంది.

కృష్ణా యూనివర్సిటీలో నేడు లెక్కింపు..

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెనమలూరు నియోజకవర్గ ఓట్లను మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో రూమ్ నంబరు 201ఏ, ఫస్ట్ ఫ్లోర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అకడమిక్ బ్లాక్‌లో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఆరు టేబుళ్లను సిద్ధం చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. సాధారణ ఓట్ల లెక్కింపు 8.30 నుంచి ప్రారంభిస్తారు. ఇందుకుగానూ 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు.



పెనమలూరు నియోజకవర్గం మ్యాప్



పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రం

అందరి దృష్టి పెనమలూరు పైనే..

మొదటి నుంచి అందరి దృష్టి పెనమలూరు పైనే ఉంది. ఇక్కడి నుంచి ఒక దశలో టీడీపీ నుంచి చంద్రబాబు, లేదా ఆయన కుటుంబ సభ్యులు పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. కమ్మ సామాజిక వర్గ ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈ సీటును చేజిక్కించుకోవాలనేది కూటమి ప్లాన్. టీడీపీ అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించిన బోడె ప్రసాద్‌కే సీటు లభించింది. వైఎస్సార్ సీపీ నుంచి రాష్ట్ర మంత్రి జోగి రమేష్ బరిలో నిలిచారు. ఎన్ఆర్ఐ మద్దతు, కూటమి మద్దతుతో ఉన్న బోడె ప్రసాద్ ఓ వైపు, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పాలనతో జోగి రమేష్ మరో వైపు ప్రధాన అభ్యర్థులుగా బరిలో నిలవడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడికి వచ్చిన అనతికాలంలోనే నియోజకవర్గ ప్రజలకు దగ్గరై అందరివాడుగా జోగి రమేష్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సంక్షేమం తప్పనిసరిగా గెలిపిస్తుందనే భరోసాతో వైఎస్సార్ సీపీ ఉంది. టీడీపీ మాత్రం కమ్మ సామాజిక వర్గ ఓటింగ్, కూటమి ఓటు బ్యాంకుపై ఆశలు పెట్టుకుంది.

గెలుపుపై భారీ బెట్టింగులు..

గెలుపుపై నియోజకవర్గంలో భారీగా బెట్టింగులు జరుగుతున్నాయి. గ్రామాల వారీగా మెజార్టీ, మొత్తం ఆధిక్యత, గెలుపు ఏ పార్టీది అన్న పందేలు ఒకటికి రెండు, ఒకటికి మూడు చొప్పున జరుగుతున్నాయి. ఏది ఏమైనా నేడు ఓటరు నిర్ణయంతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

అన్ని పార్టీల నేతలు సంయమనంతో ఉండాలి

ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి



గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

పెనమలూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సంయమనంతో ఉండాలని కృష్ణా జిల్లా ఎస్పీ ఆద్నాన్ నయీం అస్మి సూచించారు. పెనమలూరు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఎస్పీ విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలు తెలుపుతూ కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల నియమావళిని అందరూ పాటించాల్సిందేనన్నారు. 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్టు 30 అమలులో ఉందన్నారు. నలుగురికి మించి గుమిగూడరాదని, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని హెచ్చరించారు. గొడవలకు దిగడం, రెచ్చగొట్టే విధంగా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఫైరింగ్ చేయడానికైనా వెనుకాడమన్నారు. అనుమతి పత్రాలు ఉన్న వారిని మాత్రమే మచిలీపట్నం కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఇతర వ్యక్తులు ఎవ్వరూ కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లరాదని నిబంధనలు అతిక్రమిస్తే వెంటనే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తారనే అనుమానం ఉన్న వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు అందరూ సహకరించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గన్నవరం నియోజకవర్గంలో పోలింగ్ సమయంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎదుర్కొనేందుకు పోలీసులతో పాటు కేంద్ర బలగాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పికెట్లను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ జయసూర్య, ట్రైనీ డీఎస్పీ శ్రీవేది, సీఐ వరప్రసాద్, ఎస్ఐ కనకదుర్గ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు



గన్నవరం వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బారికేట్స్



ఉయ్యూరులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ హబీబ్‌బాషా



పోరంకి సెంటర్‌లో గ్యాస్ గన్ ప్రదర్శిస్తున్న డీఎస్పీ సుభాష్



నున్నలో పోలీసు ఫుట్ పెట్రోలింగ్

కంకిపాడు: అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీఎస్పీ సుభాష్ సూచించారు. కంకిపాడు మండలంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన పికెట్‌లను, బందోబస్తు చర్యలను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళి సమర్థంగా అమలు చేయాలని, ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సందీప్ పాల్గొన్నారు.

నాలుగు చోట్ల పికెట్‌లు..

ఎన్నికల కౌంటింగ్ రీత్యా మండలంలోని వివిధ గ్రామాల్లో నాలుగు చోట్ల పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ డి.సందీప్ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా గొడవర్రు, మంతెన, ఉప్పలూరు, కంకిపాడులో పికెట్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పార్టీ కార్యాలయాల ఎదుట బారికేట్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇనుప ముళ్ల కంచెలతో దారులను మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144, పోలీసు యాక్ట్ 30ను అమలులోకి తీసుకువచ్చారు.

ఉయ్యూరు: కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని సీఐ హబీబ్‌బాషా ఆదేశించారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ఎన్నికల కోడ్‌ను సమర్థంగా అమలు చేయాలన్నారు. కోడ్ ఉల్లంఘించి ఏ ఒక్కరు ప్రవర్తించినా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. సమావేశంలో ఎస్ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రత పర్యవేక్షణలో కఠినంగా ఉండాలి

పెనమలూరు: ఓట్ల లెక్కింపు సమయంలో అసాంఘీక శక్తులు చెలరేగిపోతే పోలీసు సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఇన్‌చార్జ్ డీఎస్పీ సుభాష్ అన్నారు. పోరంకి సెంటర్‌లో సోమవారం రాత్రి పోలీసు సిబ్బందికి గ్యాస్ గన్(భాష్ప వాయువు ప్రయోగించే గన్) ఎలా ఉపయోగించాలో వివరించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో అలాగే రాజకీయ నేతల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీల నేతలకు హెచ్చరికలు కూడా జారీ చేశామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైన వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే బాష్పవాయువు ఉపయోగిస్తామని అన్నారు. కార్యక్రమంలో పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు, కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు, ఎస్ఐలు రమేష్, శేషుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ సిబ్బంది సోమవారం నున్న, పాతపాడు, మంగాపురం, అప్పారావుపేట, విలేజి కంద్రిక ప్రాంతాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించరాదంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ మైక్ ప్రచారం నిర్వహించారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదని హెచ్చరించారు. నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు ఫుట్ పెట్రోలింగ్ చేశారు.

జాతీయోద్యమంలో గ్రంథాలయాల పాత్ర కీలకం



పురుషోత్తపట్నంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులకు వందనం సమర్పిస్తున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో నృత్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఉంగుటూరులో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



పెనమలూరులో పరుగు పందెంలో విద్యార్థులు



తెన్నేరులో క్రికెట్ శిక్షణ పొందుతున్న చిన్నారులు

గన్నవరం రూరల్: జాతీయోద్యమంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన వీరులను స్మరించడం మన కర్తవ్యమని విద్యార్థులకు, పాఠకులకు తెలియజేసి వందనం సమర్పించారు. అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం సేవలను కొనియాడారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు జరిగాయి. విజేతలను గ్రామ పెద్ద ఎం.శేషగిరిరావు అభినందించారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు నృత్య శిక్షణ ఇచ్చారు. కథల పుస్తకాలు చదివించి, సంగీతం నేర్పించారు. సంగీతం టీచర్ జి.మాధవి విద్యార్థులకు వేమన పద్యాలు, నృత్యం నేర్పారు. రీసోర్సు పర్సన్ ఎన్.పావనాకృతి విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

ఉంగుటూరు: మండలంలో జిల్లా శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లోని గ్రంథాలయల్లో సోమవారం పుస్తక పఠనం, కథలు, న్యూస్ పేపర్ చదివించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, స్నేక్ అండ్ లేడర్, లెమన్ స్పూన్ వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెనమలూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం పెనమలూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులను రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, కోకో వంటి పలు ఆటల పోటీలు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారని గ్రంథాలయ అధికారిణి హరీష తెలిపారు. వణుకూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు.

కంకిపాడు: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్రికెట్‌లో శిక్షణ, భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ ఆసక్తి గల రంగాలను ఎంచుకుని విద్యార్థులు ప్రతిభను చాటాలని సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలు, పోటీలను సునీత పర్యవేక్షించారు.

పేదలకు సేవలు మరింత విస్తృతం చేయాలి



పేద మహిళలకు బియ్యం అందజేస్తున్న సుబ్బారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు రావూరి(దత్త) అధికారిక పర్యటన సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి ఆధ్వర్యంలో గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు పేద కుంటుంబాలకు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, పేద విద్యార్థులు పది మందికి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అదేవిధంగా పోలియో ఫండ్ కింద రూ. 25 వేలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు పేదలకు అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కోవిడ్ కష్టకాలంలో రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు వివిధ రూపాల్లో అందించిన సేవలు మరుపురానివని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి సాయం అందించినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి, రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్షుడు ధనేకుల భరత్ కుమార్, కార్యదర్శి మద్దాలి శ్రీనివాస కుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడరోడ్డులో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల కిరాణా దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడి రూ. లక్ష సొత్తు అపహరించారు. వివరాల్లోకి వెళ్లితే.. మూలకొట్టు సెంటర్‌లోని వెంకటలక్ష్మి జనరల్ స్టోర్‌లో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దుకాణ యాజమాని మాటూరి పార్థసారథి సోమవారం ఉదయం యథావిధిగా షాపు తెరిచేందుకు రాగా, అప్పటికే తాళాలు పగలుకొట్టి ఉండటంతో ఆందోళన చెందాడు. షాపులోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. దుకాణంలో రూ. 40 వేలు విలువ చేసే సిగరెట్లతో పాటుగా రూ. 60 వేలు నగదు అపహరించినట్లుగా బాధితుడు వాపోయాడు. చోరీ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే షాపులో గత నెలలోనూ దుండగులు చోరీకి పాల్పడి రూ. 2 లక్షలు విలువ చేసే సరుకు దొంగిలించారని బాధితుడు తెలిపారు.

ఘనంగా ముగిసిన హనుమజ్జయంతి వేడుకలు



స్వామివారి గ్రామోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ శ్రీ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో సోమవారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. సోమవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏసీపీ భాస్కరరావు, మాచవరం సీఐ గుణరామ్ ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై స్వామివారిని ఉంచి మేళతాళాలు డప్పు వాయిద్యాలతో మాచవరం పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది. దారి పొడవునా మహిళలు, భక్తులు స్వామివారికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కనపర్తి కొండలరావు, కోలా నాగాంజనేయులు, గణేష్, బొల్లిగర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మంగా పాలించిన సీఎం జగన్

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలు అధికారం ఇస్తే దర్పంతో కాకుండా ధర్మంగా పాలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలతో రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నాటి నుంచి అధికారం కోసం ఏనాడూ పొత్తులు పెట్టుకోని నాయకుడు జగనన్న అన్నారు. తన జెండా..అజెండా... పొత్తు అన్నీ ప్రజలతోనే అని విశ్వసించి ఆయన చేసిన రాజకీయ ప్రయాణం ఆదర్శనీయమని కొనియాడారు. అలవికాని హామీలు ఇవ్వడం, ఇచ్చిన మాట తప్పడం చరిత్రలోనే లేని కుటుంబం వైఎస్ జగన్‌దని పేర్కొన్నారు. తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల అవసరాలను తెలుసుకుని వారికి సంక్షేమాన్ని అందించి దేశానికే ఆదర్శంగా నిలిచిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పం, ప్రతి పేదింటి బిడ్డ చదువుకోవాలన్న తపనతో విద్యారంగంలో చేసిన సంచలన మార్పులు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పేదవాడు డబ్బు లేక అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోకూడదని నాడు మహానేత వైఎస్ రెండు అడుగులు వేసి ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే జగనన్న నాలుగు అడుగులు ముందుకేసి ఆరోగ్య సురక్ష పేదవాడి ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అన్న విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నిక కాబోతున్న వైఎస్ జగనన్నకు ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

శ్రీభవానీ శంకరస్వామికి 108 కలశాలతో అభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత పోలిన శ్రీభవానీ శంకరస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రీ భవానీ శంకరస్వామివారి విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తయిన దృష్ట్యా విశేషంగా మండలాభిషేకం, 108 కలశాలతో పంచామృత అభిషేకం, రుద్ర హోమం వేదపండితులతో శాస్త్రోక్తంగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు, దాత లక్ష్మణరెడ్డి పూజా కార్యక్రమాలలో పాల్గొని పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com